
సాక్షి
అనంతపురం
శనివారం । 25 । మార్చి । 2023




చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



టమాట కిలో రూ.23

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.7.50 పలికింది.



రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
ఇఫ్తార్	సెహరి
06.33	05.03

న్యూస్‌రీల్

కనుల పండువగా లంకాదహనం



లంకాదహన దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు లంకాదహనం కనులపండువగా జరిగింది. సాయంత్రం నెట్టికంటుడిని ఒంటె వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామివారిని పల్లకీలో ఆలయం నుంచి అనుబంధ కాశీవిశ్వేశ్వరాలయం వరకు ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలోకి తీసుకొచ్చి వేదగోష్టి పూజ నిర్వహించారు. అనంతరం అక్కడ నుండి ఊరేగింపుగా నెట్టికంటుడి ఆలయ ప్రాంగణం చేరుకుని.. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో లంకాదహనం చేశారు.

లింగ నిర్ధారణ తీవ్రమైన నేరం



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ తీవ్రమైన నేరమని, ఈ చర్యలకు పాల్పడే స్కానింగ్ సెంటర్లు, వైద్యులపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. లింగ వివక్ష చూపే వారిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో లింగ నిష్పత్తిని గమనిస్తే బాలికల శాతం తక్కువగా ఉందన్నారు. ఎక్కడైనా లింగ వివక్ష జరుగుతున్నట్లు బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులు తగిన ఆధారాలతో వస్తే విచారణ చేసి, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ సెంటర్లు, వైద్యులపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మొదటిసారి రూ.10 వేలు జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష, రెండవసారి కూడా గర్భస్థ పిండ లింగనిర్ధారణ చేస్తే రూ.50 వేలు జరిమానా, ఐదేళ్ల జైలు శిక్ష, మూడోసారి/చివరగా రూ.లక్ష జరిమానా, ఐదేళ్ల జైలు శిక్షతోపాటు వైద్య వృత్తి గుర్తింపు శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేంద్రుడు, డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి, నోడల్ అధికారి గంగాధర్, ప్రోగ్రాం అధికారులు సుజాత, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.


కేజీబీవీల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

రాప్తాడురూరల్: జిల్లాలోని 32 కేజీబీవీల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 6, 11 తరగతుల ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి, డీఈఓ సాయిరామ్ తెలిపారు. ఆయా కేజీబీవీల్లో 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.దరఖాస్తును https://apkgbv.apcfss.in సైట్ ద్వారా పొందవచ్చని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని, సంబంధిత కేజీబీవీ నోటీసు బోర్డులో జాబితాలు ప్రచురిస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు 90002 04935 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

కోత కోసేశారు!

- పక్కా కమర్షియల్..
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్‌కే మొగ్గు
- బిల్లుల రూపంలో రూ.50 వేల వరకు వసూలు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో కాసుల కోసం కక్కుర్తి

బిడ్డకు జన్మనివ్వడం అంటే ప్రతి తల్లికీ పునర్జన్మ వంటిదే. సహజంగా సాధారణ (నార్మల్) డెలివరీ, సిజేరియన్ అని రెండు పద్ధతులు ఉంటాయి. సాధారణ పద్ధతిలో కాకుండా శస్త్రచికిత్స ద్వారా బిడ్డకు జన్మనివ్వడాన్ని సిజేరియన్ లేదా సీ – సెక్షన్ డెలివరీ అంటారు. సాధారణ పద్ధతిలో డెలివరీ జరగడం కష్టం అనుకున్నప్పుడు తల్లి, బిడ్డ ప్రాణాలను రక్షించడానికి సిజేరియన్ చేస్తారు. అయితే కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు సాధారణ ప్రసవాలకు అవకాశం ఉన్నా కాసుల కోసం.. లేనిపోని భయాందోళనలు సృష్టించి సిజేరియన్ ఆపరేషన్‌కు ఒప్పిస్తున్నాయి.



సాక్షి ప్రతినిధి, అనంతపురం:

- గుత్తి మండలానికి చెందిన లక్ష్మీదేవి గత బుధవారం పురిటినొప్పులు రాగానే అనంతపురంలోని ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంకు వచ్చింది. నాలుగు గంటల వ్యవధిలోనే ఆమెకు సిజేరియన్ చేసి కాన్పు చేశారు. పూర్తి స్థాయిలో రక్తపరీక్షలు చేయకుండానే కోత కాన్పు కానిచ్చేశారు.
- ఉరవకొండకు చెందిన 21 ఏళ్ల సుల్తానా రజియా రెండో కాన్పు కోసం అనంతపురం వచ్చింది. మొదటి కాన్పు సుఖప్రసవం అయినా రెండో కాన్పులో మాత్రం ఆ అవకాశం లేదని సిజేరియన్ చేయాలని ఓ నర్సింగ్ హోం డాక్టర్లు చెప్పారు. దీంతో విధిలేక సిజేరియన్ ద్వారా ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

సుఖప్రసవం జరిగి తల్లీ బిడ్డ క్షేమంగా, ఆరోగ్యంగా ఉండాలనేది ప్రభుత్వ ఆకాంక్ష. దీని కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ప్రభుత్వాస్పత్రిలోనూ అవసరమైన అన్ని వసతులూ కల్పించింది. సిజేరియన్ ప్రసవాలు అత్యవసరమైతేనే చేయాలని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ ప్రైవేటు ఆస్పత్రులు యథేచ్ఛగా కోత కాన్పులు (సిజేరియన్లు) చేస్తూనే ఉన్నాయి. పేషెంటు రావడమే ఆలస్యం... ఏదో ఒక కారణం చెప్పి సిజేరియన్ ప్రసవం చేస్తున్నారు. సిజేరియన్ ద్వారా ప్రసవం చేయడం అటు తల్లికీ బిడ్డకూ మంచిది కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ పదే పదే హెచ్చరిస్తున్నా ప్రైవేటు ఆస్పత్రుల్లో కోతల ప్రసవాలకు నియంత్రణే లేకుండాపోతోంది.

వ్యాపారంగా మారిన ప్రసవాలు

ప్రసవాలు పక్కా వ్యాపారమయ్యాయి. సాధారణ ప్రసవమైతే నర్సింగ్‌హోంలో రూ.10 వేలు కూడా బిల్లు కాదు. అదే సిజేరియన్ అయితే ఆస్పత్రి శ్రేణులను బట్టి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకూ వసూలు చేస్తారు. మూడు రోజులు ఇన్‌పేషెంటుగా ఉంటే కనిష్టంగా రూ.50వేలు వేయొచ్చు. దీనికోసమే ఎక్కువ నర్సింగ్ హోంలలో సిజేరియన్ ప్రసవాలకే మొగ్గుచూపుతున్నారు. అదే ప్రభుత్వాస్పత్రుల్లో ప్రైవేటుతో పోల్చుకుంటే చాలా తక్కువ సిజేరియన్ ప్రసవాలుంటాయి. ఇకనైనా ప్రైవేట్ వైద్యులు తల్లీబిడ్డల ఆరోగ్యం దృష్ట్యా సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇస్తే బాగుంటుందని ప్రజలు సూచిస్తున్నారు.

అనవసరంగా సిజేరియన్ చేయొద్దు



ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్ చేశామంటే దానికి ఆడిట్ జరుగుతుంది. కారణం కచ్చితంగా చెప్పాలి. అందుకే ప్రభుత్వాస్పత్రుల్లో విధిలేకపోతే తప్ప సిజేరియన్ చేయం. ప్రైవేటు ఆస్పత్రులకు కూడా నియంత్రణ ఉంది. డీఎంహెచ్‌ఓ పర్యవేక్షణలో ఉంటుంది. ఎవరైనా సరే ప్రత్యేక కారణం లేకుండా సిజేరియన్ ప్రసవం చేయకూడదు.

–డాక్టర్ కృష్ణవేణి, జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయకర్త (డీసీహెచ్‌ఎస్), అనంతపురం

అనంతపురం జిల్లాలో 2022 ఏప్రిల్ నుంచి 2023 ఫిబ్రవరి వరకు ప్రసవాలు	
ఆస్పత్రుల్లో మొత్తం ప్రసవాలు	35,005
ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు	11,701
సిజేరియన్ ప్రసవాలు	3,849
సిజేరియన్ ప్రసవాల శాతం	32.89
ప్రైవేటులో జరిగిన ప్రసవాలు	23,304
సిజేరియన్ ప్రసవాలు	10,360
సిజేరియన్ ప్రసవాల శాతం	44.46

శ్రీసత్యసాయి జిల్లాలో 2022 ఏప్రిల్ నుంచి 2023 ఫిబ్రవరి వరకు ప్రసవాలు	
ఆస్పత్రుల్లో మొత్తం ప్రసవాలు	20,142
ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు	4,798
సిజేరియన్ ప్రసవాలు	766
సిజేరియన్ ప్రసవాల శాతం	15.96
ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలు	15,344
సిజేరియన్ ప్రసవాలు	7,545
సిజేరియన్ ప్రసవాల శాతం	49.17

సిజేరియన్ డెలివరీతో నష్టాలు

- డెలివరీ సమయంలో తల్లికి ఎక్కువగా రక్త స్రావం జరుగుతుంది.
- సిజేరియన్ గాయం వల్ల తల్లికి భవిష్యత్‌లో ఇతర సమస్యలు రావచ్చు.
- ఒక్కోసారి ఇన్ఫెక్షన్లు సోకితే తల్లికి ఎక్కువ ప్రమాదం ఉంటుంది.
- సాధారణ ప్రసవమైతే వెంటనే శిశువుకు తల్లిపాలు వస్తాయి. సిజేరియన్ అయితే ఆలస్యం కావచ్చు.
- సిజేరియన్ ప్రసవం వల్ల శిశువుకు శ్వాసకోశ సమస్యలు రావచ్చు.
- ఒకసారి సిజేరియన్ అయితే రెండోసారి గర్భం దాల్చినప్పుడు మరిన్ని సమస్యలుంటాయి.
- సిజేరియన్ వల్ల దీర్ఘకాలంలో వెన్నుపూస సమస్యలు లేదా ఊబకాయం వచ్చే అవకాశం ఎక్కువ.

నొప్పి నుంచి ఉపశమనం

- 'రేడియో ఫ్రీక్వెన్సీ ఎబిలేషన్'తో ఉచిత వైద్యం
- సర్వజనాస్పత్రిలో అందుబాటులోకి ఆధునిక వైద్య సేవలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: మెట్రో నగరాల్లో మాత్రమే లభించే ఆధునిక వైద్య సేవలు అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు అందుబాటులోకి వచ్చాయి. రూ.లక్షల ఖరీదైన రేడియో ఫ్రీక్వెన్సీ ఎబిలేషన్ వైద్యం ఉచితంగా అందిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఆర్థో ఆపరేషన్ థియేటర్‌లో సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ నవీన్ కుమార్ మీడియాకు వెల్లడించారు. క్యాన్సర్ బాధితులు, నరాల ఒత్తిడి, మోకాళ్ల నొప్పులు, శస్త్రచికిత్సలకు శరీరం సహకరించని వారికి 'రేడియో ఫ్రీక్వెన్సీ ఎబిలేషన్' విధానం ద్వారా నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తారు. విపరీతమైన నొప్పులతో అవస్థలు పడుతున్న వారికి ఈ వైద్యం ఎంతో ఉపయోగపడుతుంది. కార్యక్రమంలో డాక్టర్లు మధుసూదన్, శ్రీహరిబాబు, నాగేంద్ర, నాగరాజు నాయక్, జ్యోత్స్న, జగదీషాచారులు, ఆదిలక్ష్మి, మురళీప్రభాకర్, అరుణలత తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

రాయదుర్గం: 'పది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. గతేడాదిలో జరిగిన కొన్ని తప్పిదాలను సరిదిద్దుకుని మంచి ఫలితాలు రాబట్టేలా పటిష్ట ప్రణాళికలకు రూపకల్పన చేశాము' అని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) సాయిరామ్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి రాయదుర్గం పట్టణంలో డిప్యూటీ డీఈఓ శంకర్‌ప్రసాద్, ఎంఈఓలు నాగమణి, విజయకుమారి, అలెస్కో రవీంద్రలతో కలసి ఆకస్మికంగా పర్యటించారు. పది విద్యార్థుల ఇళ్లకు నేరుగా వెళ్లి వారి పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు.

కళ్యాణదుర్గం: ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని డీఈఓ సాయిరాం స్పష్టం చేశారు. పట్టణంలోని స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల నాణ్యత, పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

అక్రమాలపై నిగ్గు తేల్చండి

- రూ.110 కోట్ల భూమిని రూ.2.80 కోట్లకే కట్టబెట్టారు
- రామగిరి గ్రానైట్ రవాణాలోనూ రూ.1000 కోట్ల దోపిడీ
- బినామీ పేర్లతో భూముల రిజిస్ట్రేషన్
- విజిలెన్స్ విచారణకు రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి డిమాండ్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: టీడీపీ హయాంలో రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన అక్రమాలపై నిగ్గు తేల్చాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. రాప్తాడు సమీపాన పేజ్ ఇండస్ట్రీస్‌కు రూ.కోట్లు విలువైన భూములను కారుచౌకగా కట్టబెట్టిన వైనంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో మాట్లాడారు. నారా లోకేష్ పరిశ్రమల మంత్రిగా ఉన్నప్పుడు పేజ్ ఇండస్ట్రీస్ అనే సంస్థకు హైవే పక్కన 28 ఎకరాల భూమిని, ఎకరం రూ.10 లక్షల చొప్పున కేటాయించారన్నారు. అంటే రూ.2.80 కోట్లకు 28 ఎకరాల భూమిని రిజిష్టర్ చేశారన్నారు. వాస్తవానికి ఆ భూమి ఎకరం రూ.4 కోట్లు చేస్తుందన్నారు. ఈ లెక్కన ఆ భూమి విలువ రూ.110 కోట్లు అవుతుందన్నారు. ఆ సంస్థ మూడేళ్లలో ఆ భూమిని అమ్ముకునేలా జీఓ కూడా ఇచ్చారన్నారు. 2016లో భూములు ఇచ్చినా 2019 వరకు ఆ సంస్థ ఈ ప్రాంతానికే రాలేదన్నారు. జీఓ మీద, ఆ సంస్థకు కేటాయించిన భూముల మీద విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. అయితే పచ్చ మీడియా.. తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో దోపిడీ, స్కాములు జరిగాయన్నారు.

రాయల్టీ లేకుండానే గ్రానైట్ తరలించేశారు

రామగిరి గ్రానైట్‌కు సంబంధించి నసనకోట, మాదాపురం పంచాయతీల్లో ఎన్నో ఫ్యాక్టరీలకు లీజులు ఇచ్చారని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే ఆయా ఫ్యాక్టరీల నిర్వాహకులు రాయల్టీ చెల్లించడం లేదన్నారు. అనేకమార్లు విచారణ చేయించాలని తాను కోరానన్నారు. ఈ గ్రానైట్‌లో దాదాపు వెయ్యి కోట్ల దాకా కుంభకోణం జరిగిందన్నారు. రాయల్టీలు చెల్లించకుండా తరలించిన గ్రానైట్‌పైనా విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని కోరారు. జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్లు, మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల పరిధిలో ప్రభుత్వ భూములను సాగుకు కేటాయించకూడదనే నిబంధన ఉందని, ప్రభుత్వ అవసరాలకు మాత్రమే వినియోగించాలని ఉందని గుర్తు చేశారు. 2012లో 271 జీఓ వచ్చిన తర్వాత అనంతపురం రూరల్ మండలం, రాప్తాడు మండలాల్లో రూ.వందల కోట్లు విలువ చేసే భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించారన్నారు. సాగు చేయకపోయినా, ఆ భూములపై ఎలాంటి హక్కులు లేకపోయినా కొంతమంది బినామీల పేర్లు ఎక్కించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారన్నారు. ముఖ్యంగా మాజీ సైనికులకు కేటాయిస్తున్నామంటూ పాత తేదీలతో రికార్డుల్లో ఎక్కించి ఆన్‌లైన్ చేశారన్నారు. భూదోపిడీపై కూడా విజిలెన్స్ విచారణ చేయాలని కోరుతున్నామన్నారు.

మొండిబకాయిదారులకు ఓటీఎస్ అవకాశం



డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, డైరెక్టర్లు, సీఈఓ

అనంతపురం అగ్రికల్చర్: పీఏసీఎస్‌లో రుణాలు తీసుకుని గడువుమీరినా చెల్లించని మొండిబకాయిదారులకు వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) అమలు చేస్తున్నట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్ ఎం.లిఖిత తెలిపారు. శుక్రవారం డీసీసీబీ హాలులో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఇస్తున్న ప్రోత్సాహం, నాబార్డు, ఆప్కాబ్ సహకారంతో సహకార బ్యాంకులు, సొసైటీలు రైతులకు విశిష్ట సేవలందిస్తున్నాయన్నారు. ఇదే క్రమంలో మొండిబకాయిల వసూళ్లపైనా దృష్టి సారించామన్నారు. అందుకోసం బకాయిదారులకు వెసులుబాటు కల్పించేలా ఓటీఎస్ సదుపాయం అందుబాటులోకి తెచ్చామన్నారు. రైతులు, ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు మరింత పటిష్టం చేసే క్రమంలో డిజిటలైజేషన్, కంప్యూటరీకరణ కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఆకర్షణీయమైన వడ్డీరేట్లతో డిపాజిట్ల సేకరణ, తక్కువ వడ్డీరేట్లతో విరివిగా రుణాలు ఇస్తూ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. శనివారం డీసీసీబీలో జరిగే 124వ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్, ప్రొఫెషనల్ డైరెక్టర్లు కేఎస్‌పీవీ మూర్తి, అబ్దుల్ రకీబ్, పాలకవర్గం డైరెక్టర్లు జనార్దన రెడ్డి, రామాంజనేయులు, హైదర్‌వలి, ఈశ్వర్‌రెడ్డి, జీఎం కె.సురేఖారాణి, డీజీఎంలు సుఖదేవబాబు, రవి కుమార్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా మూడో విడత జమ

- ఎస్‌హెచ్‌జీల్లోని 2,38,975 మంది సభ్యులకు లబ్ధి
- వైఎస్సార్ ఆసరా కింద రూ.183.56 కోట్లు విడుదల
- రేపటి నుంచి ఏప్రిల్ 5 వరకు వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు

అనంతపురం: మహిళా సాధికారత, ఆర్థిక పురోగతికి 'వైఎస్సార్ ఆసరా' తోడ్పడుతోంది. అధికారంలోకి వస్తే స్వయం సహాయక సంఘాల్లోని అక్కచెల్లెమ్మల బ్యాంకు రుణ మొత్తాలను నాలుగు విడతల్లో తిరిగి చెల్లిస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇప్పటి దాకా రెండు విడతల్లో అనంతపురం జిల్లాకు రూ.377 కోట్లను మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేశారు. తాజాగా శనివారం 2,38,975 మంది సభ్యుల సంఘాల ఖాతాల్లోకి రూ.183.56 కోట్లను జమ చేయనున్నారు. దెందులూరు కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నగదు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమంలో లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తారు. కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీ హాజరవుతారు. వైఎస్సార్ ఆసరా నిధుల విడుదలకు ముందు, నిధుల విడుదల తర్వాత వివిధ దశల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపైన రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. నిధుల విడుదలకు ముందు మొదటి విడతలో వైఎస్సార్ ఆసరా అమలు చేయడంలో ప్రధాన ఉద్దేశాన్ని డీఆర్‌డీఏ – వైకేపీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మహిళలకు వివరించారు. పది రోజుల కిందట ఈ కార్యక్రమం ముగిసింది. రెండో విడత కార్యక్రమాలు ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యాయి. స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై సుస్థిర జీవనోపాధుల ఏర్పాటు అవశ్యకతను వివరిస్తున్నారు. దిగ్గజ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. మూడో విడత కార్యక్రమాలు ఈ నెల 21, 22, 23, 24 తేదీల్లో జరిగాయి. ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 5 వరకు వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు నిర్వహిస్తారు. మండలాల వారీగా నిర్వహించే కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

విద్యార్థుల వివరాలు పంపండి

రాప్తాడురూరల్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను డీఈఓ కార్యాలయానికి పంపాలని జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. గత ఫిబ్రవరి 5న ఈ పరీక్ష జరిగిందని, హాజరైన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన కోసం డీఈఓ కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. జాబితాలో పేర్లు ఉన్న విద్యార్థులకు సంబంధించి కులం, ఆదాయం, 7వ తరగతి మార్కుల శాతాన్ని ధ్రువీకరించే పత్రం, వైకల్యం ఉన్న విద్యార్థులకు సంబంధించి సర్టిఫికెట్, ఆధార్, హాల్‌టికెట్ జిరాక్స్ కాపీతో జతచేసి ఈ నెల 29లోగా అందజేయాలని సూచించారు. తుది జాబితా విడుదల చేసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థనలు స్వీకరించబోమని స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గడువులోగా సర్టిఫికెట్లను సంబంధిత పాఠశాల హెచ్‌ఎంల ద్వారా డీఈఓ కార్యాలయానికి పంపేలా చూడాలని కోరారు.

● రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం



అనంతపురంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ముస్లింల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం శుక్రవారం ప్రారంభమైంది. నగరంలోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసంలోనే పవిత్ర ఖురాన్ భూమిపై అవతరించిందని, ఈ మాసంలో ఉపవాసం ఉండడం ప్రతి ముస్లిం ప్రధాన విధి అని మౌలానాలు తెలిపారు. మానవుని జీవితాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దే గొప్ప గ్రంథం ఖురాన్ అని కొనియాడారు. పేదల పట్ల దయ, తోటివారి పట్ల ప్రేమ కలిగి ఉండాలని అల్లాహ్ ఆదేశాలను, మొహమ్మద్ ప్రవక్త మార్గాలను పాటించాలని సూచించారు. చెడు మాటలు, చెడు చేష్టలు, చెడు వ్యసనాల నుంచి దూరం చేసేదే ఉపవాసమని వివరించారు.

పారదర్శకంగా పంటనష్టం అంచనాలు

- అధికారులకు జేసీ కేతన్‌గార్గ్ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్. చిత్రంలో డీఏఓ బి.చంద్రానాయక్

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు అన్యాయం జరగకుండా పంట నష్టం అంచనాలు పారదర్శకంగా తయారు చేసివ్వాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని వ్యవసాయశాఖ కార్యాలయ హాలులో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి (అగ్రి అడ్వైజరీ బోర్డు) సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఇటీవల ఈదురుగాలులు, వడగండ్లవాన లాంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలు బాగా దెబ్బతిన్నాయన్నారు. ఇప్పటికే రూ.230 కోట్ల వరకు పంటనష్టంతో ప్రాథమిక నివేదికలు తయారు చేసినా... మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి వారంలోపు పక్కాగా పంటనష్టం జాబితా అందజేయాలని ఆదేశించారు. తర్వాత ఆర్‌బీకే వేదికగా సామాజిక తనిఖీ చేపట్టి అభ్యంతరాలు అంటే స్వీకరించి.. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వానికి తుది నివేదిక పంపుతామని వెల్లడించారు. జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్ మాట్లాడుతూ రబీ ఈ–క్రాప్, ఈ–కేవైసీ పూర్తయ్యిందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.5,335 ఎంఎస్‌పీ ప్రకారం రైతుల నుంచి పప్పుశనగ కొనుగోళ్లు చేస్తున్నట్లు చెప్పారు. 232 ఆర్‌బీకేలకు అనుబంధంగా వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద గరిష్టంగా 40 శాతం రాయితీతో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ) ఏర్పాటుకు అవసరమైన చర్యలు వేగవంతం చేశామని తెలిపారు. వచ్చే ఖరీఫ్‌కు విత్తనాలు, ఎరువులు, ఇతరత్రా ఇన్‌పుట్స్‌కు సంబంధించి ముందస్తు చర్యలు చేపట్టాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో డీహెచ్‌ఓ బి.రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ అధికారి పిరోజ్ ఖాన్, ఎల్‌డీఎం బి.నాగరాజారెడ్డి, మార్కెటింగ్ ఏడీ పి.సత్యనారాయణచౌదరి, పట్టుశాఖ అధికారి ఆంజనేయులు, శాస్త్రవేత్తలు, డివిజన్ ఏడీఏలు, టెక్నికల్ ఏఓలు పాల్గొన్నారు.

విప్లవ యోధుడు.. ముడార్ వేణుగోపాల్

సందర్భం : రేపు ముడార్ వేణుగోపాల్ విగ్రహావిష్కరణ

- అనంత వాసుల్లో విప్లవ బీజాలు నాటిన అభ్యుదయవాది
- జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- ముడార్ ఉగాది పురస్కారాలు అందించనున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: విప్లవయోధుడు... అభ్యుదయ కవిత్వాన్ని పండించిన కవి.. నిబద్ధత కల్గిన పాత్రికేయుడు.... విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాడిన ఉద్యమకారుడు... విలక్షణ జీవితంతో అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచిన వ్యక్తి ముడార్ వేణుగోపాల్. ఆయన జయంతి వేడుకను ప్రజాహిత సాహితీ సంస్థ సభ్యులు స్ఫూర్తిదాయకంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు అనంతపురం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించునున్నారు.

అవినీతికి వ్యతిరేకంగా తిరుగుబాటు

మహాకవి శ్రీశ్రీ , విప్లవ యోధుడు తరిమెల నాగిరెడ్డి, గద్దర్, కొండపల్లి సీతారామయ్య, వరవరరావు, దిగంబర కవులతో కలిసి పనిచేస్తూ అనంత వాసుల్లో అభ్యుదయ భావజాలాన్ని రేకెత్తించిన విప్లవ జ్యోతి ముడార్ వేణుగోపాల్ జీవితం ఆద్యంతం పోరాటమయం. 1936 మార్చి 24న సామాన్యమైన సంప్రదాయ కుటుంబంలో వేణుగోపాల్ జన్మించారు. అభ్యుదయ భావాలు అధికంగా ఉండటంతో యువకుడిగా ఉన్నప్పుడే పాలకుల అవినీతికి వ్యతిరేకంగా నాటి కమ్యూనిస్టు నాయకులతో కలిసి తిరుగుబాటు జండా ఎగురవేశారు. 1975లో దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ కాలంలో విప్లవ జ్వాలాలు రగులుకున్న సమయంలో ఆయన పాలకులను ఎదిరించి 18 నెలల పాటు కారాగార శిక్షను అనుభవించి ఉద్యోగాన్ని సైతం పోగొట్టుకున్నాడు. 'చైతన్య సాహితి' సంస్థ ద్వారా ఆయన నాటిన విప్లవ బీజాలు నేటికీ ఎంతో మందిని పోరాటం వైపు నడిపిస్తున్నాయి. 2020 జూన్ 11న ఆదర్శ భావాలను అనుచరులలో నింపి కానరాని లోకాలకు వెళ్లిపోయారు.

జీవితమంతా పోరాటమే..

ముడార్ వేణుగోపాల్ యువకుడిగా ఉన్న సమయంలో ఆయన అవినీతిని చెండాడుతూ రచించిన 'బంధూక' 'రక్తగానం' పుస్తకాలను నాటి ప్రభుత్వం నిషేధించింది. దేశద్రోహం కింద జైలుకు కూడా పంపింది. కానీ ఆయన పోరాటాన్నే మార్గంగా ఎంచుకోవడంతో ఎన్ని కష్టాలు అనుభవించినా సామాన్యుల స్వేచ్ఛాయుత జీవనం కోసం పోరాటం చేశారు. విరసం పెద్దల సూచనతో తన సంస్థను అందులో విలీనం చేశారు. కొంత కాలం జర్నలిస్టుగా కూడా విప్లవ వార్తలను పత్రికా ప్రపంచానికి అందించారు. పదవీ విరమణ తర్వాత 'ప్రజాహిత సాహితీ' సమితిని స్థాపించి సాహిత్యాభిమానుల, సాహితీవేత్తల కృషికి తోడ్పాటునందించారు.

వైఎస్సార్‌పై అంతులేని అభిమానం

ఓ వైపు పీడిత, తాడిత ప్రజల పక్షాన పోరాడుతూనే దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డిలో నిజమైన సోషలిస్టు ఉన్నాడని పలు సభల్లో చెప్పారు. వైఎస్సార్ పట్ల వీరాభిమానం కనపరిచే ముడార్ వేణుగోపాల్‌ను ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన వైఎస్సార్ మరణం ఎంతో కుంగదీసింది. ఆ బాధను జీర్ణించుకోలేకనే ఆయన 'జయహో' పేరిట కవితా సంకలనాన్ని వెలువరించారు. వైఎస్సార్‌కు పేరు తెచ్చిపెట్టిన 108 నంబర్‌కు గుర్తుగా కవితలతో ఆవిష్కరించిన పుస్తకం ఎంతో మందిని ఆకట్టుకుంది. పరిశ్రమలశాఖలో పదవీ విరమణ అనంతరం పెన్షనర్ల అభ్యున్నతికి తీవ్రంగా శ్రమించారు. అయితే నాటి ప్రభుత్వం అండతో కొంత మంది నాయకులు వైఎస్సార్ చిత్రపటాన్ని సంఘం కార్యాలయంలో తొలగించడంతో వచ్చిన విబేధాల వల్ల సొంతంగా 'విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం' పేరుతో కొత్త సంఘాన్ని ఏర్పాటు చేసి విశ్రాంత ఉద్యోగుల సమస్యల పట్ల రాజీ లేని పోరాటం చేశారు.


సజీవత ఉట్టిపడేలా ముడార్ వేణుగోపాల్ విగ్రహం

రేపు ముడార్ ఉగాది పురస్కారాలు

చిరస్మరణీయంగా నిలిచే యోధుల్లో ఒకరైన ముడార్ వేణుగోపాల్ 84వ జయంతి సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ప్రజాహిత సాహితీ సంస్థ నిర్వాహకులతో పాటూ ఆయనతో కలిసి పనిచేసిన సహచరులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ముడార్ విగ్రహాన్ని ఆవిష్కరించునున్నారు. సజీవత ఉట్టిపడేలా ఉన్న విగ్రహాన్ని ఆయన కుటుంబ సభ్యులు విదేశీ సాంకేతిక సహకారంతో తయారు చేయించారు. అదేవిధంగా ఆయనతో కలిసి పనిచేసిన వారి ప్రసంగాల అనంతరం, ఆయన జయంతి సందర్భంగా నిర్వహించిన ఉగాది కవితల పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి 'ముడార్ వేణుగోపాల్ ఉగాది పురస్కారాలను అందించనున్నారు. జిల్లా అభ్యుదయ సాహిత్యాన్ని విప్లవ మార్గంలో నడిపించిన ముడార్ జయంతి వేడుకల్లో పాల్గొనాలని ప్రజాహిత సాహితి నిర్వాహకులు ముడార్ సుధీర్ విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

సమాచార రంగమే కీలకం

- ఎస్కే యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ సిద్ధయ్య


సదస్సులో పాల్గొన్న అతిథులు

రాప్తాడురూరల్: ప్రపంచ వ్యాప్తంగా సమాచార రంగం ఉన్నత విద్యను మరింత ఆధునికం చేయడమే కాకుండా విస్తృతమైన అవకాశాలను సృష్టించిందని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం (తిరుపతి) మాజీ రిజిస్ట్రార్ టి.సిద్ధయ్య అన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, వాణిజ్య-నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో 'భారత్‌లో డిజిటల్ విధ్వంసక పరిజ్ఞానాలు- ధోరణులు- సవాళ్లు - అవకాశాలు' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సిద్ధయ్య మాట్లాడుతూ దేశ జనాభాలో 70 శాతం ఉన్న యువతను భారత దేశాభివృద్ధితో భాగస్వామ్యంగా మార్చింది సమాచార రంగమేనన్నారు. ఉన్నత తరగతుల లోనే దేశ భవిష్యత్తు నిర్మాణం అవుతోందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి , ఎస్కే యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు పీబీ అప్పారావు, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ ఏవీ రమణ, ప్రొఫెసర్లు డి.ఆంజనేయులు, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి


మృతురాలు రోజా

రాప్తాడు: మండల కేంద్రం రాప్తాడులోని 44వ జాతీయ రహదారిపై 8 రోడ్ల కూడలిలో వై జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువతి మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. రాప్తాడు ఎస్ఐ పీ.వై.ఆంజనేయులు వివరాల మేరకు.... చిలమత్తూరు మండలంలోని తమ్మినాయనపల్లికి చెందిన కిష్టప్ప కుమార్తె రోజా (30), అనంతపురం జిల్లాలోని గుంతకల్లు మండలంలోని నాగసముద్రంకు చెందిన గురుస్వామి కుమారుడు ఈడిగ దినేష్ ఇద్దరూ శింగనమల మండలంలోని లోలూరు దగ్గర డీఆర్‌డీఏ అధికారులు నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో రోజా రిసెప్షనిస్టుగా , దినేష్ హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం అనంతపురం నుంచి రామగిరికి 44వ జాతీయ రహదారి గుండా వెళ్తున్నారు. ఎస్కేయూ ధర్మవరం పంగల్ రోడ్డు నుంచి అనంతపురం వైపు అతివేగంగా వెళ్తున్న టిప్పర్ వై జంక్షన్‌లో వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. క్షతగాత్రులను 108 ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రోజా మృతి చెందింది. ఈడిగ దినేష్ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

బీసీల బ్యాక్ బోన్.. సీఎం జగన్

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బీసీల బ్యాక్ బోన్‌గా అభివర్ణించారు ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ. బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసిన నేపథ్యంలో ఆమె సీఎం జగన్‌ను శుక్రవారం అమరావతిలోని క్యాంప్ కార్యాలయంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. బీసీలను ఓటు బ్యాంకుగా చేసుకొని అనేక పార్టీలు లబ్ధి పొందాయని, అయితే బీసీల సంక్షేమానికి ఏ పార్టీ కట్టుబడి లేదని ధ్వజమెత్తారు. అయితే జగనన్న... బీసీలను బ్యాక్ బోన్ క్లాసెస్‌గా భావించి, రాజకీయంగా ఆ వర్గాలకు ప్రాధాన్యం కల్పించడం గర్వంగా ఉందన్నారు. ముఖ్యంగా బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం వాల్మీకులెవరూ మరచిపోలేరన్నారు. జగన్‌కు తమ జాతి రుణపడి ఉంటుందన్నారు.

నీటి తొట్టెలో పడి రైతు మృతి


మృతుడు చిన్న వెంకటరెడ్డి (ఫైల్)

పుట్లూరు: మండలంలోని సి.వెంగన్నపల్లి గ్రామానికి చెందిన తలపాగల చిన్న వెంకటరెడ్డి (70) అనే రైతు శుక్రవారం ప్రమాదవశాత్తూ ఫారంపాండ్‌లో పడి మృతి చెందాడు. స్థానికుల వివరాలమేరకు... రైతు చిన్న వెంకటరెడ్డి గ్రామ సమీపంలోని తోట వద్దకు వెళ్లిన సమయంలో గట్టు నుంచి మంటలు తొటకు వ్యాపించడాన్ని గుర్తించాడు. వెంటనే తన తోటలోని ఫారంపాండ్‌లోకి వెళ్లి నీటిని తీసుకొచ్చి మంటలను ఆర్పడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఫారంపాండ్‌లోకి జారి పడ్డాడు. అయితే నీటిలో నుంచి బయటకు రాలేక మృతి చెందాడు. సమీప పొలాల్లోని రైతులు చిన్న వెంకటరెడ్డి ఫారంపాండ్‌లో పడినట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పాన్ని విజయవంతం చేద్దాం


ఇంధన వనరుల నిల్వ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ ప్రభాకర్‌రావు

యాడికి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకొని జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కేఎల్ ప్రభాకర్‌రావు సూచించారు. యాడికి మండల కేంద్రంలో ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద ఉరవకొండ, వజ్రకరూర్ మండలాలకు సంబంధించి శుక్రవారం యాడికి పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి, సర్పంచు అనూరాధ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌డబ్ల్యూపీసీపై శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా డీపీఓ ప్రభాకర్‌రావు హాజరై మాట్లాడారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డులలో వర్మీ కంపోస్టుగా మార్చడంపై అవగాహన కల్పించారు. అనంతరం యాడికి డంపింగ్ యార్డులో జరుగుతున్న తడి, పొడి చెత్త సేకరణ, వర్మీ కంపోస్టును పరిశీలించించారు. కేంద్రం ఆవరణలోని ఇందన వనరుల నిల్వ కేంద్రంను పరిశీలించి అక్కడ ఉన్న భవనాల నిర్మాణాలలోని వేస్టు మెటీరియల్‌ను ఆ భవనాల యజమానులే ఇక్కడికి తరలించేటట్లు వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ దామోదర్ రెడ్డి, యాడికి, ఉరవకొండ ఎంపీడీఓలు వెంకటేశ్వర్లు, రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు హైకోర్టు జడ్జీల పర్యటన

- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప


హైస్కూల్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

రాయదుర్గం: పట్టణంలో శనివారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వస్తున్న హైకోర్టు న్యాయమూర్తుల పర్యటనకు పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప తెలిపారు. శుక్రవారం కళ్యాణదుర్గం డీఎస్పీ బీ శ్రీనివాసులు, సీఐ యుగంధర్, న్యాయశాఖ అధికారులతో కలసి జడ్జీలు పర్యటించే ప్రాంతాల్లో ట్రాఫిక్, ఇతర ఏర్పాట్లపై సమీక్షించారు. ఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ శనివారం ఉదయం 6 గంటలకు అనంతపురం రైల్వేస్టేషన్ నుంచి ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు ఏవీ శేషశయ్య, డీ రమేష్, బీ శ్యామసుందర్ చేరుకుంటారన్నారు. 8:45 లోపు బ్రేక్‌ఫాస్ట్ పూర్తిచేస్తారన్నారు. 9 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 10:30 గంటలకు రాయదుర్గం ఆర్‌అండ్‌బీకి చేరుకుంటారని తెలిపారు. 10:40 గంటలకు మద్దానేశ్వర కళ్యాణ మంటపం వద్ద ఏర్పాటు చేసిన న్యాయ సదస్సులో పాల్గొంటారని చెప్పారు. స్టాల్స్‌ను సందర్శించిన తర్వాత జిల్లాలో ఉన్న 39 మంది జోగినీలకు శాశ్వత భూహక్కు చట్టం కింద పట్టాలు పంపిణీ చేస్తారన్నారు. అనంతరం ఆర్డీటీ సౌజన్యంతో నిర్మించతలపెట్టిన 39 ఇళ్లకు సంబంధించి రూ.1.2 కోట్ల విలువ చేసే మెగా చెక్కు ఆవిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం భోజనం తర్వాత పట్టణంలోని దశభుజ గణపతి ఆలయంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. అక్కడి నుంచి న్యాయమూర్తి డీ రమేష్ తాను చదివిన కణేకల్లు రోడ్డులోని హైస్కూల్‌ను జడ్జీల బృందంతో కలసి సందర్శిస్తారని చెప్పారు. బాల్య మిత్రులతో ఏర్పాటు చేసిన గెట్ టు గెదర్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

కుట్రలకు పెట్టింది పేరు చంద్రబాబు

- ప్రజలు టీడీపీకి బుద్ధిచెప్పడం ఖాయం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: 'టీడీపీ అధినేత చంద్రబాబు కుట్ర రాజకీయాలకు పెట్టింది పేరు.. అధికారం కోసం సొంత మామ ఎన్‌టీఆర్‌ను గద్దెదింపారు.. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేశారు.. బాబు కుట్ర రాజకీయాలకు ప్రజలే బుద్ధి చెబుతారు'అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబుపై ఆయన మండిపడ్డారు. టీడీపీ అధికారంలో ఉండగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనుగోలు చేశాడని విమర్శించారు. అందుకే గత ఎన్నికల్లో ప్రజలు కేవలం 23 స్థానాలకే పరిమితం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు ఆనం రాంనారాయణరెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి టీడీపీ అభ్యర్థికి ఓటేసి అమ్మపాలు తాగి రొమ్ము గుద్దారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కుట్రలో భాగస్వామ్యులైన వారిని వైఎస్సార్‌సీపీ అధిష్టానం సస్పెండ్ చేయడానికి స్వాగతిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్ దయాభిక్షతో గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలకు సిగ్గూ, సరం, మానం, అభిమానం ఉంటే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి తప్పక బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

గార్లదిన్నె: మండల పరిధిలోని కల్లూరులో శుక్రవారం ఉరివేసుకొని ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. ఏఎస్ఐ గురుమూర్తి వివరాల మేరకు.. కల్లూరుకు చెందిన శంకరయ్య(62) అనే వృద్ధుడు వంట మాస్టర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవారన్నారు. 8 నెలలు క్రితం భార్య అనారోగ్యంతో చని పోవడంతో ఇంట్లో ఒంటరిగా నివసిస్తుండేవారన్నారు. ఆయన కుమారులిద్దరూ వేర్వేరు గ్రామాల్లో ఉండటంతో ఒంటరితనం భరించలేక, అనారోగ్యంతో కారణాలతో జీవితంపై విరక్తిచెంది ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అంత్యక్రియల్లో గాయపడిన వ్యక్తి మృతి

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం తండాకు చెందిన తిప్పేస్వామి నాయక్(45) బెంగళూరులో చికిత్స పొందుతూ మృతిచెందాడు. తిప్పేస్వామినాయక్ బావమరిది భార్య పంపనూరులో అనుమానాస్పదస్థితిలో మృతి చెందడంతో గత శనివారం దహన సంస్కారాలకు వెళ్లారు. అంత్యక్రియల్లో పాల్గొని మృతదేహంపై పెట్రోల్ పోసి నిప్పంటిస్తుండగా తిప్పేస్వామి నాయక్ ఒంటిపై పడి మంటలు చెలరేగడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం బెంగళూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అయితే చికిత్సపొందుతూ తిప్పేస్వామినాయక్ శుక్రవారం మృతి చెందారు. మృతునికి భార్య కవిత, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి


ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి

అనంతపురం సప్తగిరి సర్కిల్: సమష్టిగా కృషి చేసి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలిద్దామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎక్స్‌రే మిషన్ ప్రారంభం

స్థానిక జిల్లా క్షయ నివారణ కార్యాలయంలో 500 ఎంఏఎస్ డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. చెస్ట్ డాక్టర్ సుదీంద్ర, మీనాక్షమ్మ ట్రస్ట్ రవికాంత్, రమణ దాతల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. పేదలకు అందుబాటులోకి అధునాతన వైద్యాన్ని అందించేందుకు దాతల సహకారం ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, నగర కార్యదర్శి శ్రీధర్‌బాబు, సిబ్బంది ఓబిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రావణి, మహేష్, జయ, రేవతి, సూరి, అంజి, నారాయణ, వెంకటేష్, ఖాదర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంజన్న రథోత్సవం

అశేష భక్తజనం మధ్య సాగుతున్న అంజన్న రథోత్సవం


అలంకరణలో ఆంజనేయస్వామి

డీ. హీరేహాళ్ మండలంలోని మురడి ఆంజనేయస్వామి ఆలయంలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం స్వామి బ్రహ్మరథోత్సవం వైభవంగా జరిగింది. భక్తుల జయ జయ ధ్వానాల నడుమ గ్రామ పురవీధుల్లో రథచక్రాలు శోభాయమానంగా కదిలాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది. మహిళలు పొర్లు దండాలతో భక్తి భావం చాటుకున్నారు. శనివారం లంకా దహనం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

- రాయదుర్గం

క్లుప్తంగా

సర్వజనాస్పత్రిలో వైద్యసేవలపై ఆరా

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని వివిధ విభాగాలను సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా విభాగాల్లో అందుతున్న వైద్య సేవలపై ఆయన ఆరా తీశారు. ఐడీ వార్డు, క్యాజువాలిటీ, ఈఎన్‌టీ వార్డు, చెస్ట్ వార్డు, ఫార్మసీ విభాగం, రేడియాలజీ విభాగం, ఏఎంసీ విభాగంతో పాటు పలు విభాగాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య విభాగాధిపతులు డాక్టర్ ఆత్మారాం, డాక్టర్ భీమ్‌సేనాచారి, డాక్టర్ రామస్వామి, ఆర్‌ఎంఓ పద్మజ, సునీత, సీఎంఓ రామాంజనేయులు, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 రజిని తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం సెంట్రల్: నగరంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ లలిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. రాణినగర్-6, 11 అంగన్‌వాడీ వర్కర్స్ పోస్టులతో పాటు సాయినగర్-2, మరువకొట్టాల, వినాయక నగర్-1, రాణినగర్ -11, ఆముదాల వీధి-1, యర్రనేల కొట్టాల-3, మున్నానగర్-6 అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శ్రీరామనామసంకీర్తనలో భాగస్వాములు కండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అమ్మవారి శాల నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఈనెల 29న నిర్విరామంగా సాగే శ్రీరామనామ సంకీర్తనలో భాగస్వాములు కావాలని పాతూరు కన్యకాపరమేశ్వరి ఆలయం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, నిర్వాహకుడు రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం శ్రీరామ నామ సంకీర్తన పోస్టర్లను ఆవిష్కరించారు. పాతూరు అమ్మవారి శాలలో జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు రమణమూర్తి, చలపతిరెడ్డి, నాగరాజు, గోపా బదిరి, సంస్కార భారతి సెక్రటరీ లక్ష్మి, కౌసల్య, కనంపల్లి ఉమారాణి తదితరులు మాట్లాడారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో గొరిదిండ్లలో 1, ముట్టాలలో 1, సనపలో 2 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 3న ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన వారు సర్టిఫికెట్లు తీసుకురావాలని తెలిపారు.

ఎస్సీల్లో చేర్చాలనే నిర్ణయం అభినందనీయం

అనంతపురం కల్చరల్: దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి రుణపడి ఉంటారని ఐసీసీ రాష్ట్ర అధ్యక్షుడు కోటమలిగే ఆనంద్ అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దళితులు వేరే మతంలోకి మారినంత మాత్రాన వారి జీవన స్థితిగతులు మారవని, ప్రభుత్వం గొప్పగా ఆలోచించడం అభినందనీయమన్నారు. దీనికి అందరూ మద్దతు నివ్వాలని డిమాండ్ చేశారు.

క్షయ నిర్మూలనే లక్ష్యం

ఆత్మకూరు: క్షయ నిర్మూలనే లక్ష్యంగా కృషి చేయాలని డాక్టర్ నబిహా సుల్తానా తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవ సందర్భంగా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ నాగేశ్వరయ్య, సీహెచ్ చంద్రావతి, సూపర్‌వైజర్ బాబా సాహెబ్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విషద్రావకం కలిసిన నీరుతాగి గొర్రెలు మృతి

ఆత్మకూరు: సనప గ్రామానికి చెందిన ముట్టాల లక్ష్మిరెడ్డి అనే గొర్రెల కాపరికిచెందిన 15 గొర్రెలు విషద్రావకం కలిసిన నీరు తాగి గురువారం రాత్రి మృత్యువాతపడ్డాయి. దీంతో దాదాపు రూ.2లక్షల వరకు నష్టపోయినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రమాదాలు ఎదుర్కోవడంపై అవగాహన

శింగనమల: వరదలు, కాలువలు, చెరువుల్లో ప్రమాదాలను ఎదుర్కోవడంపై శింగనమల చెరువులో శుక్రవారం సత్యసాయి జిల్లా వలంటీర్లకు కర్నూలు సెకండ్ బెటాలియన్ సిబ్బంది అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఆపద మిత్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు.


నిర్మానుష్యంగా ఉన్న సుభాష్‌రోడ్డు


స్కార్ఫ్ కట్టుకొని వెళ్తున్న మహిళ


తార్పాలిన్ కింద సేదతీరుతున్న మహిళ


ఎండకు తాళలేక తోపుడు బండిని వదిలి నీడకు వెళ్లిన వ్యాపారి


గొడుగు నీడలో చిన్నారిని తీసుకెళ్తున్న మహిళలు

● చిర్రెత్తిస్తున్న సూరీడు

మార్చి నెల ముగుస్తోంది. ఏప్రిల్ వచ్చేస్తోంది.. ఇంట్లో ఉంటే ఉక్కపోత, వీధుల్లో తిరిగితే మండే ఎండ. జనం అడుగుతీసి అడుగు వేయాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి. నెత్తిన సూరీడు సుర్రుమంటున్నాడు. నగరంలో అప్రకటిత కర్ఫ్యూ తలపిస్తోంది. ప్రధాన రోడ్లు జనం లేక బోసిపోతున్నాయి. మహిళలు, చిన్నారులు, వృద్ధులు అత్యవసరమైతేనే బయటకు వస్తున్నారు. చిరు వ్యాపారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలో ఉడికిపోతున్నారు. వాహనాల్లోనో..గొడుగు నీడనో.. తలకు తువ్వాలు చుట్టుకునో.. స్కార్ఫులు కట్టుకునో వెళ్లాల్సి వస్తోంది. ఇటీవల వడగండ్ల వర్షం కురిసింది. కొద్దిగా ఉక్కపోత నుంచి ఉపశమనం లభించినా.. ఎండలు మళ్లీ మండుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

యువశక్తితో రాజకీయాల్లో సమూల మార్పు


వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్లు, అధికారులు

అనంతపురం కల్చరల్: యువశక్తితోనే రాజకీయాల్లో సమూల మార్పు సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాల డ్రామాహాలులో 'నైబర్‌హుడ్ యూత్ పార్లమెంటు' కార్యక్రమం ఆసక్తిగా జరిగింది. ఎన్‌వైకే అధికారి శ్రీనివాసులు నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కరరెడ్డి, ఏఎస్పీ హనుమంతు, ప్రిన్సిపాల్ దివాకరరెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మురళీధర్, జీఎల్ఎస్ ప్రసాద్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ సుంకర రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు విష్ణుప్రియ, ఆదిరెడ్డి పరదేశీనాయుడు, నగరూరు రసూల్, నాగశుభ, ప్రజాగాయకుడు లెనిన్, భరత్, యోగా గురువు మహేష్‌బాబు, నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య తదితరులు మాట్లాడారు. అనంతరం ప్రతిభ కనపరిచిన యువతీయువకులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు.

హౌసింగ్ బోర్డులో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో నగర మేయర్ వసీం, ముస్లింలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న మస్జిదే హజ్జాజ్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మేయర్ వసీం, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు రంజాన్ తొలి ఉపవాసం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ నాయకులు బషీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో భాగ్యనగర్‌లోని మస్జిదే రజాలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ముస్లింలు, మత పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగార్జున రెడ్డి, ఖాజా, రామకృష్ణ, శర్మాస్‌వలి పాల్గొన్నారు.

రీ సర్వే విజయవంతం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరించిన మేయర్ వసీం

అనంతపురం క్రైం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసి విజయవంతం చేయాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థలో మేయర్ 'మీ భూమి మా హామీ' పోస్టర్లను మేయర్ ఆవిష్కరించారు. స్థిరాస్తిదారులకు శాశ్వత భూ హక్కు కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు అబూ సలేహా, చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాసులు, మునిశేఖర్, నాయకులు వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, పాల్గొన్నారు.

'స్వయం ఉపాధిలో 'రాణి'ంపు

● ప్రభుత్వ సాయంతో యూనిట్ల ఏర్పాటు
● నాణ్యమైన వస్తువులకు డిమాండ్


జాతీయ చేనేత ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన స్టాళ్లు

అనంతపురం క్రైం: ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా అందిస్తున్న ఆర్థిక సహకారంతో పలువురు మహిళలు 'రాణి'స్తూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. నాణ్యతే పెట్టుబడిగా ఏర్పాటు చేసుకున్న యూనిట్లకు గుర్తింపు లభిస్తోంది. విదేశాలకు ఆహార పదార్థాలు, పొడులు కొరియర్ ద్వారా సరఫరా చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. నగరంలోని టీటీడీ కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత ఎక్స్‌పోలో వాటిని ప్రదర్శనలో ఉంచారు.

ఆర్థిక ప్రగతి సాధిస్తున్నాం



గ్రూపు ద్వారా తీసుకన్న డబ్బులతో హెన్నా, సున్నిపిండి, కుంకుడి, బొప్పాయ, మందార, చింతగింజలతో సహా 50 రకాల పొడులు తయారు చేస్తున్నాం. వాటిని ఆర్డర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాం. ప్రతి నెలా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వ్యాపారం జరుగుతుంది. డ్వాక్రా రుణాలు, రుణమాఫీతో వచ్చిన డబ్బులను పెట్టుబడిగా వాడుకొని ఆదాయం పొందుతున్నాం. నా పెద్ద కూతురును తెలంగాణలో బీటెక్ చదివిస్తున్నా. అమ్మఒడితో చిన్నమ్మాయి భవిష్యత్తుకు వాడుతున్నాం. ప్రభుత్వం చొరవతో ఆర్థిక ప్రగతి సాధించాం.

– నీలిమ, అరుణ ఎస్‌హెచ్‌జీ, విజయవాడ

11 అవార్డులు తీసుకున్నా



ఎలాంటి కెమికల్స్ లేకుండా నాణ్యత ప్రమాణాలతో వివిధ రకాల సోపులు, షాంపు, పెయిన్ రిలీఫ్ ఆయిల్స్, వేప, తులసి, మునగ పొడులు తయారు చేసి, 60 రకాల వస్తువులను ప్రజలకు అందిస్తున్నాం. కెమికల్‌ఫ్రీ వస్తువులు కావడంతో ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. నాణ్యత, బెస్ట్ సెల్లర్‌గా రాష్ట్ర స్థాయిలో 11 అవార్డులు తీసుకున్నా. అమెరికా, దుబాయ్ తదితర ప్రాంతాలకు సరుకు సరఫరా చేస్తున్నాం.

– అన్నపూర్ణ, షిర్డిసాయి ఎస్‌హెచ్‌జీ, పొన్నూరు, గుంటూరు

కాలిఫోర్నియాకు పచ్చళ్లు



పండుమిర్చి, మామిడికాయ, అల్లం, టమాట, వంకాయ, చిన్న ఉల్లిపాయ, గోంగూర, ఉసిరికాయ, కాకరకాయ, చింతకాయ, పెండ్లం, కంద, కొబ్బరికారం, కాకరకాయ కారం, నల్లకారం, తదితర వాటిని పచ్చళ్లతో పాటు వివిధ రకాల తినుబండారాలను తయారు చేస్తాం. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన చేనేత ప్రదర్శనలో ఆహారపదార్థాలు అందుబాటులో ఉంచుతాం. రూ.10 వేలతో పచ్చళ్ల వ్యాపారం ప్రారంభించా. ప్రస్తుతం రూ.15 లక్షల (ఏటా) టర్నోవర్‌కు చేరింది. మాగ్రూపు ద్వారా రూ.2లక్షలు రుణం పొంది, వ్యాపారానికి వాడుకున్నాం. రూ.90 వేలు మాఫీ అయ్యింది. సీఎం జగన్ సార్ మేలు మరువలేం.

– రత్నమాణిక్యం, భవాని మహిళా గ్రూపు గుంటూరు జిల్లా

రెడ్‌క్రాస్ సొసైటీకి రూ.5లక్షల విరాళం


కలెక్టర్ నాగలక్ష్మి చెక్కు అందిస్తున్న సప్తగిరి క్యాంఫర్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ హనీఫ్, తదితరులు

అనంతపురం అర్బన్: రెడ్‌క్రాస్ సొసైటీకి సప్తగిరి కాంఫర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.5 లక్షల విరాళం ఇచ్చింది. శుక్రవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ హనీఫ్, తదితరులు కలిసి చెక్కు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి పరిశ్రమలు సోషల్ రెస్పాన్సిబిలిటీ (సామాజిక బాధ్యత) తీసుకోవాలన్నారు. ఈ క్రమంలో సప్తగిరి కాంఫర్ కంపెనీ తమ వంతుగా బాధ్యతను నిర్వర్తిస్తుండడం అభినందనీయమన్నారు.

అక్రమ నిర్మాణదారులపై కేసులు పెట్టండి

● టౌన్ ప్లానింగ్ అధికారులకు కమిషనర్ రమణారెడ్డి ఆదేశం


టౌన్ ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: నగరంలోని అక్రమ నిర్మాణదారులపై చార్జ్‌షీట్ దాఖలు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాసులు రెడ్డి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీ, పట్టణ ప్రణాళిక కార్యదర్శులను కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ విభాగంతో ఆయన సమావేశం నిర్వహించారు. పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యాన్ని ఆయన తప్పుబట్టారు. సమావేశానికి లైసెన్స్ ఇంజినీర్లు, కొందరు అధికారులు హాజరుకాకపోవడంపై ఏసీపీ శ్రీనివాసులు రెడ్డి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. 1, 11, 41, 23, 71, 25,45, 46 సచివాలయాల పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై కార్యదర్శులను ఆరాతీశారు. 71వ సచివాలయ పరిధిలో రాజహంస వెంచర్ వేసినప్పుడు వారిపై ఎందుకు చార్జ్‌షీటు దాఖలు చేయలేదని సంబంధిత ప్లానింగ్ కార్యదర్శిని కమిషనర్ ప్రశ్నించారు. కమలానగర్‌లో జేకే మార్కెటింగ్ నిర్వాహకులపైన చర్యలు తీసుకోలేదని, రాంనగర్‌లోని జ్ఞాన సరస్వతి స్కూల్ ముందున్న సెల్లార్ నిర్మాణాన్ని పూడ్చివేయాలని ఏసీపీ శ్రీనివాసుల రెడ్డిని ఆదేశించారు.

నిర్లక్ష్యం చేస్తే సస్పెండ్ చేస్తా

అక్రమ నిర్మాణాలు చేపడితే చార్జ్‌షీట్, మూడేళ్ల జైలు శిక్ష, భూమి విలువపై రోజూ 1 శాతం అపరాధ రుసుం, కరెంటు, నీటి సరఫరా కోత, తర్వాత నిర్మాణం కూల్చివేస్తారన్న కఠిన చట్టాలను భవన నిర్మాణాదారులకు తెలియజేయాలని కమిషనర్ అన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది బృందంగా ఏర్పడి అక్రమ నిర్మాణాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి, అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే సస్పెండ్ చేస్తానని ఆయన హెచ్చరించారు. నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తే మొదటిసారిగా నోటీసు జారీ చేసి రూ.10,000 జరిమానా, రెండోసారి అదే తప్పు చేస్తే ట్రేడ్ లైసెన్స్ రద్దు, తర్వాత షాపులను సీజ్ చేస్తామని కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం రాజురోడ్డులోని మహావీర్, మహాలక్ష్మి ప్లాస్టిక్స్‌లపై కమిషనర్ రమణారెడ్డి ఆకస్మిక తనిఖీ చేపట్టారు.

నేడు పంచాయతీ రూముల వేలం

చెన్నేకొత్తపల్లి: స్థానిక పంచాయతీ రూముల వేలం పాట శనివారం ఉదయం 11 గంటలకు ఉంటుందని ఎంపీడీఓ అశోక్‌నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల కేంద్రంలోని సంత మార్కెట్ వద్ద పంచాయతీ నిధులతో నిర్మించిన 16 రూములను వేలం వేయనున్నట్లు తెలిపారు.

వైద్యవృత్తిలో విలువలపై అవగాహన


వైద్యులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఏపీ మెడికల్ కౌన్సిల్ ఈఎం ప్రసాద్‌రెడ్డి తదితరులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 'వైద్య వృత్తిలో విలువలు' అంశంపై 2017 బ్యాచ్ హౌస్‌సర్జన్లకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డాక్టర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సేవల ద్వారా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. అనంతరం హౌస్ సర్జన్ పూర్తి చేసిన వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, షారోన్ సోనియా, న్యూరాలజిస్టులు భాస్కర్, రవితేజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరదేశినాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా చేయాలని వినతి

ఆత్మకూరు: విద్యుత్ అంతరాయంతో పంటలు ఎండుతున్నాయని ఆత్మకూరుకు చెందిన పలువురు రైతులు ట్రాన్స్‌కో ఏఈ దాస్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం తొమ్మిది గంటలు విద్యుత్ అందచేస్తామని తెలియచేసినా ట్రాన్స్ కో అధికారులు విద్యుత్ ఎందుకు వదలలేదని ప్రశ్నించారు.

5న ఢిల్లీలో కార్మిక కర్షక ప్రదర్శన

ఆత్మకూరు: కేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో జరగనున్న కార్మిక కర్షక ప్రదర్శనలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయు రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగభూషణం పిలుపునిచ్చారు. శుక్రవారం జీపుజాతా కార్యక్రమాన్ని ఆత్మకూరులో నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కౌలు రైతు జిల్లా సంఘ కార్యదర్శి బాల రంగయ్య, సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పదోతరగతి విద్యార్థులకు ధర్మవరానికి చెందిన ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష సామగ్రి అందించారు. 100 మంది విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగించే ప్యాడ్, పెన్నులు అందజేశారు. ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూత అందించాలనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవింద రెడ్డి, ఎంపీపీ అంజలి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి ఎంఈఓ కృష్ణమోహన్, యూటీఎఫ్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌టెన్నిస్‌లో కాంస్య పతకం


క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి రోజా

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 19 నుంచి 23 వరకు ఒరిస్సాలో జరిగిన జాతీయ స్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో ఏపీ మహిళల జట్టు కాంస్య పతకం సాధించినట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి జ్యోతి మేరి తెలిపారు. ఈ టోర్నీలో పతకాన్ని సాధించి నేషనల్ గేమ్స్‌కు అర్హత సాధించారన్నారు. మహిళల జట్టు నుంచి మానస, పురుషుల జట్టు నుంచి ఆరోన్ రోనాల్డిన్హో, రాహుల్ రోహిత్ ప్రాతినిధ్యం వహించారన్నారు. వీరిని మంత్రి రోజా, ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిమోహన్ అభినందించారు.

నేడు తలకు గాయాల నివారణ ర్యాలీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: తలకు గాయాల నివారణ ర్యాలీని శనివారం ఉదయం 8 గంటలకు స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రి నుంచి ప్రారంభిస్తున్నట్లు న్యూరో సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ భాస్కర్ తెలిపారు. మార్చి నెల మొత్తం తలకు గాయాల నివారణ మాసంగా పరిగణించినట్లు తెలిపారు. ర్యాలీ ప్రభుత్వ సర్వజనాస్పత్రి నుంచి సప్తగిరి సర్కిల్ నుంచి మెడికల్ కళాశాల వరకు సాగుతుందన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం

రాప్తాడు: క్షయ వ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని వైద్యాధికారులు శ్రావని, శివకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది టీబీపై ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో టీబీ నివారణ సాధ్యమవుతుందన్నారు. టీబీ అంటు వ్యాధి అని ఒకరి నుంచి మరొకరికి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. దుమ్మూధూళి ప్రదేశాల్లో పనిచేసేవారికి , మద్యంపానం చేసే వారికి, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ వ్యాధి తొందరగా సోకుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం మందులు ఇస్తుందని, పౌష్టికాహారం నిమిత్తం రోగి ఖాతాలో నెలకు రూ.500 చొప్పున 6 నెలల పాటు జమ చేస్తుందన్నారు.

రామగిరి ఎంఈఓగా గోపాల్

రామగిరి: మండల విద్యాధికారిగా గోపాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంఈఓగా కంబదూరుకు చెందిన సాయికృష్ణ విధులు నిర్వర్తించేవారు. రొళ్ల మండలం ఎంఈఓగా ఉన్న గోపాల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన మాట్లాడుతూ పది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాజశేఖర్, కంప్యూటర్ ఆపరేటర్ ఆజాద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.